రెండు జీవితాలు

శ్రీ మాడభూషి వెంకటాచార్యులు

కళ్లజోడు సరిచేసుకొని భాను ఉత్తరం చదువ మొదలెట్టాడు.

"ప్రియమైన భానూ,

అంతా క్షేమం. నీ జాబు అందింది. అది చదువుతూ ఉన్నంతసేపూ నీ మీద పట్టరానికోపం వచ్చింది. నువ్వే నా ఎదురుగా ఉంటేనా — నీ బుగ్గలుపట్టుకొని నులిమేసి ఉందును; నిన్ను రక్కేసి పెట్టేదును. నీ అక్క హృదయం నీకు ఇంకా అర్థం కాలేదుగదా. ఎలా అవుతుందిలే? తరతరాల నుంచి స్త్రీ జాతిని అణచిపెట్టి ఉంచిన ఆ నిష్ఠుర పురుషజాతికి చెందినవాడివేగా నువ్వుగూడ!

చలంరాశాడే 'స్త్రీ'లో స్త్రీని గురించి, ఎంత నైచ్యంగా ఈ నాటికాలంలో స్త్రీ తన జీవితం గడుపుతోందని. అంతకంటె కనాకష్టంగా, నికృష్టంగా, కాలం వెళ్లబుస్తున్నా. ఆ పుస్తకం మొదటిసారి చదివినప్పుడు కలలోగూడ అనుకోలేదు నాగతీ అల్లాఅవుతుందని. కాని అల్లాగే అయింది. అచ్చంగా అల్లాగే!

ఒక దున్నపోతుకు నన్ను అంటగట్టి నా జీవితమంతా వాడితోఉండి ఏడవమని శాసించింది ఈ పాడు సంఘం. దానికి హృదయం ఉంటేగా feelings ఉండడానికి. ఈ పోతురాజు నాకింత తిండి, కట్టబట్ట, ఉండటానికి పంచ ఇస్తున్నాడు. అందుకుగాను నా శరీరం, నా మనస్సు, నా ఆత్మ - ఇవన్నీ నాశనం చేసుకోవాలి."

ఇంజనుకు హఠాత్తుగా బ్రేకుపడింది. "ఈ ఉత్తరం రాసిందెవరురా? ఆ నారీమణి భోగట్టా కాస్త చెలవిద్దూ భానూ! పుణ్యం ఉంటుంది" అన్నాడు భరత్ మోహన్.

భాను క్లుప్తంగా చెప్పాడు. "ఆమె ఒక దేవి. వయస్సు పాతికపైబడ్డాయి. ఇంటరు ప్యాసయింది. చిత్రకళ నేర్చుకుంది. మంచి శ్రావ్యమైనగాత్రం. బాగా పాడుతుంది. కాస్త ఫిడేలుకూడ వాయిస్తుంది. పెళ్లిఅయి నాలుగేళ్లయింది. ఇప్పుడు కోయంబుత్తూరులో అత్తారింట్లోఉంది. స్కూల్ ఫైనలుదాకా తాను ఆమె తణుకులో ఒకే క్లాసులో చదువుకుంటూ వచ్చారు. తనంటే ఆమెకెంతో ఇష్టం. తన్ను సొంత తమ్ముడిలాగా చూసుకుంటోంది."

"ఏమిట్రా పురాణం చెపుతున్నావ్? ఆ ఉత్తరం చదువు" అన్నా విసుగుకుంటూ.

"ఇంకొక్కమాట చెప్పనీయరా ఆచారీ" అన్నాడు భాను.

"సరే. ఆమె చక్కనిచుక్క "అంతేనా?" అనేశా చటుక్కున.

"ఆఁ. అదే చెప్పాలనుకున్నా. తర్వాత" అని బండిని ముందుకు పోనిచ్చాడు భాను.

"నేను చాలా దురదృష్టజీవిని. నా రాతకి సుఖంకూడానా! సుఖపడాలిసిన గీతే ఉంటే ఈయన్ని ఎందుకు పెళ్లి చేసుకొనేదాన్ని? భానూ! నావివాహం ఒకపొరబాటు - అతనికిగాని, నాకుగాని సుఖంలేదు. ఈ నాలుగేళ్లు ఎలాగడిపానో! ఇక ముందు ... కారుచీకటి. భవిష్యత్తంతా నిరాశామయం. ఎటూ పిసరంతైనా వెలుగుకానరావడం

లేదు. పెళ్ళి కాకముందు నాలో ఉన్న హుషారు, ఉత్సాహం, ఆనందం, అనురాగం - అన్నీ ఇగిరిపోయాయి. ఆ మంచి రోజులన్నీ గడిచిపోయాయి. మళ్ళీ అవి రావా? భానూ! లెక్కలేనన్ని ఎన్ని రాత్రిళ్లు నడిరేయిదాకా పడకమీదపడుకొని వెక్కి వెక్కి ఏడ్చానో, ఎవడికి తెలుసు? కాని నా కన్నీళ్ళకు విలువ ఏముంది? నా దిగులు కనేవాడు వినేవాడు ఎవడు?

మధ్యాహ్నం వేళల అందరు విశ్రాంతి తీసుకుంటుంటే సామానుల గదిలోకిపోయి పెట్టెమీద కూర్చొని నీతో ఎన్ని సంగతులు మాట్లాడాననుకున్నావు? నువ్వు విన్నావా? చెవులుంటేగా నీకు? నాకు పిచ్చి ఎత్తదుగదా భానూ!

సాయంకాలం పూట మా ఆవరణలో ఒక్కతెనే పచార్లుచేస్తూ ఉంటాను. ఒక తులసికోట ఉంది. దానికి నా గోడు మొరపెట్టుకుంటూ ఉంటాను. అది జడపదార్థం. చేతనంతో కూడుకుని ఉన్న నా దుఃఖం దానికి బోధపడుతుందా? పగటి వేళల సూర్యుణ్ణి, వెన్నెల రాత్రిళ్లలో చంద్రుణ్ణి, చీకటి రాత్రిళ్లలో నక్షత్రాల్ని చూస్తూ, ఎంత బాధతో వాటి ముందర నా ఆవేదన వెళ్లబోసుకుంటానో నీకెల్లా తెలుస్తుంది?

“వెర్రిచెల్లి” అని పెదాలువిరిచి ముసిముసి నవ్వులు నవ్వుకుంటున్నావా - ఇది చదువుకుంటూ? అవునులే, ఎలుకలకు ప్రాణసంకటం, పిల్లులకు చెలగాటం! ఇక్కడ నాతో మనసిచ్చి మాట్లాడే దిక్కులేదు. సుఖం, సంతోషం, సంతృప్తి ఇచ్చే వస్తువులేదు. నవ్వుతూ మాట్లాడేవాళ్లు, సరస సల్లాపాలు ఆడేవాళ్లు, నా లలితకళల రుచి చవిచూచేవాళ్లు, ఎవ్వరూలేరుగదా. వంటచేసుకుంటూ - మరచిపోయాను - ఈ మధ్యనే మా నాయరు తన దేశం వెళ్లాడు సెలవుతీసుకొని. వంటచేయడం నా వంతు. అన్నం కుతకుత ఉడుకుతూనే ఉంటుంది.

“ఆశ నిరాశభయీ, కరూఁక్యా? ఆశ నిరాశభయీ” అని పాడుతాను. గట్టిగా ‘ప్రేంకా నాతా ఛూటా.” ఆ పైన “కబ్ తక్ నిరాశకీ అంధియారీ?” ఇల్లా పాటలమీద పాటలు సైగల్వి పాడేస్తూనే ఉంటా.

ఈ పిచ్చిరాయుళ్లంతా ఇది బండచాకిరి చేస్తూ ఉందిగదా ఏంపాడుకుంటే మనకేం! అని అనుకుంటూ ఉంటారు. వాళ్ళతిండి కార్యక్రమంలో లోటు ఉండదుగా _ కాఫీ, ఫలహారాలు, భోజనాలు. మళ్ళ కాఫీ, కీపీ. ఇంకేం కావాలి వీళ్లకు? ఈవెర్రిబాగులది ఏదో అస్తమానం పాడుకుంటూ ఉంటుంది.

మనకేం నష్టం? అని వాళ్ల ఊహ. చూశావా ఎంత స్వార్థపరులో? తెలివి తక్కువ దద్దమ్మలు కూడాను. రేయింబవళ్లు ఇరవైనాలుగు గంటలూ మంటలో మాడిపోతూ ఉన్నానే_దుర్భర నరక యాతన అనుభవిస్తూ ఉన్నానే! వాళ్ళకు చీమకుట్టినంతైనా లేదుగదా. చీకట్లో కిటికీ దగ్గర నిలబడి శూన్యంలో చూస్తూ పాడిన పాట ఏమిటో చెప్పు, చూద్దాం. పందెం - కనుక్కో. ఊఁహూఁ బుర్ర గోక్కుంటున్నావా? ఓడి పోయావులే. నీ జేజి దిగిరావాలి చెప్పడానికి.

“ప్రీత్ మేఁహై జీవన్ జోఖం” అన్న పాటోయి ఏదో కూనిరాగం తీస్తూఉందిలే అని భావించే ఈ ద్విపాద పశువులకు ఏ మర్మమవుతుంది? కటికకసాయివాళ్ళు కారూ వీరందరూ?

పచ్చపచ్చగా చక్కగా పెరిగిన చెట్లు చేమలు హాయిగా స్వేచ్ఛగా ఎగిరిపోతున్న పావురాల జంటలు, చిలకా గోరింకల్లా విహరిస్తున్న దంపతులు సినీమాలు, నిఘాటో _ ఇటువంటివి తిలకించినపుడు నాలోనుంచి ఏదో చెప్పనలవిగాని బాధ, వ్యధ, పైకి ఉబికి వస్తున్నట్లుంది భానూ. అది నీకు వ్యక్తపరచడం ఎల్లా? నేను కవయిత్రిని గాని అయి ఉంటేనా? కటికరాళ్లు కరిగేలా ఒక కరుణరస భరిత కావ్యం అల్లేదాన్నిగదా! ‘అపిగ్రావా రోది

తృప్తి, దశరథి 'వజ్రస్య హృదయం' రుజువయి ఉండేది గదా.

నా భర్తగారు ఎటువంటివాడో తెలుసా? ఆయన ఘనమైన కార్యక్రమం, దినచర్య చెప్పనా! "పొద్దు ఎక్కిన తర్వాత ఎనిమిది గంటలకు అయ్యగారు పక్కమీదనుంచి లేస్తారు. కాఫీ సేవనం నిత్యకృత్యాలు, స్నానం ముగించుకుంటారు. కోటు, ప్యాంటు, నెక్‌టైలతో ముస్తాబవుతారు. మిల్లుకు పోతారు కారులో. నీకు తెలుసుగా ఆయన మిల్లు యజమాని అని. అందువల్లనే కామోసు ఫ్యాక్టరీ యంత్రంలాగా మొద్దుబారి రసాలు అన్నీ కరిగిపోయాయి ఆయనలో. ఒకటే యావ. డబ్బు, డబ్బు, డబ్బు. వెధవ డబ్బు! ఒకటే కూడబెట్టడం మంగళగిరి పానకాల రాయుడులాగా. ఇంకో చిత్రం చూచావు భానూ! ఈ కరువు రోజుల్లో మా మిల్లు కూలీలు జీతాలు ఎక్కువ చేయవలసిందని వేడుకున్నారు — సంఘం పెట్టుకున్నారుగా. ఈయన, తతిమ్మా మిల్లు యజమానులు బిర్రబిగిసి కూర్చున్నారు. రోగం కుదిర్చారు లేవాళ్లు. సమ్మె చేశారు. చివరికి యజమానులు రాజీ చేసుకున్నారు. చీకటి వ్యాపారంగూడవుంది ఈయనకు. మిట్ట మధ్యాహ్నం ఇంటికి చేరుకుంటారు. సరే తిండి, ఆ తర్వాత పేకాట గదిలోకి వెళ్తారు, మళ్లీ ఏ క్లబ్బుకో వెళ్లడం. రాత్రి 11 గంటలకు రావడం, మింగడం, గదిలోకి రావడం ... ఛీ ఛీ, ఏం చెప్పను నా పాడు బ్రతుకు!

అబ్బబ్బ! వాళ్లేమో ఇష్టంవచ్చినపుడు సినీమాలు చూస్తారు. స్నో సీసాలు, క్రీములు, సిల్కు చీరలు నా మొగాన పారేయడం. నేను సినీమాకి వెళ్లవచ్చు. కాని నాతో రావడం అనేది లేదు గదా. నేను తుఫానులో క్షుబ్ధసాగరంలా మథనపడుతూ ఉన్నాను. నాది ఒక బ్రతుకేనా!"

ఇంతలో భరత్ మొగంవైపు చూచాను. స్తబ్ధుణ్ణి అయినాను. అతను మానవుడా, మోడా! అతని వదనంపై సానుభూతి చిహ్నాలు లేవు. మొగం చిట్లిస్తున్నాడు. ఆవులిస్తున్నాడుకూడ. భాను చదువుతూనే ఉన్నాడు.

"నాకు శాంతి కావాలి. శాంతి, విశ్రాంతి, ప్రశాంతి కావాలి. ఈ మంట ఆరిపోదా? వంట చెయ్యడం, బండచాకిరీ చేయడం, చాటుమాటుగా ఏడ్వడం, కుళ్ళికుమిలిపోవడం, కూనిరాగాలు తీస్తూ ఉండడం — ఇల్లా ఎన్ని రోజులు?

కాదు భానూ! ఈ శోక సముద్రంలో మునిగిపోకుండా ఒక తెప్ప ఉంది. అదేమిటో తెలుసా? నీకు రాస్తూ ఉండడం — నా దుఃస్థితిలో మరెవరైనా ఉంటేనా? పగవాడికికూడ వద్దు — ఈ పాడు ఆడజన్మ. ఈ పాటికి ఎవడితోనో లేచిపోయేది. చీటికి మాటికి నీ పేరు పునశ్చరణ చేస్తూ ఉన్నాను. అందువల్ల నాకు కొంత శాంతి. ఈ ఆసరా నా నుంచి కొంపదీసి లాగేసుకోవు కదా!"

పానకంలో పుల్లలా "అరేయి! అంతూ పొంతూ లేదేరా" పల్నాడు బావుల చేంతాడులా అన్నాడు భరత్.

"చివరప్యారా" అన్నాడు భాను.

"చిన్నప్పటి రోజులు జ్ఞప్తికి వస్తున్నవి. చీకూ చింతా లేదు. మాయమర్మం తెలియదు. ఆడుతూ పాడుతూ బడికి వెళ్ళడం, సాయంకాలం తోటల్లో షికార్లు, కలిసి మెలిసి పాటలు పాడుకోవడం — భానూ! ఎంతత్వరగా ఆ సంతోషదినాలు గడిచిపోయాయి? వాటిని నెమరువేసుకుంటున్నాను. ఇప్పటి, ముందు రాబోయేటి కష్టాన్ని సహించేందుకు సిద్ధం. నా తమ్ముడూ! నీ Final year గా ఇది! బాగా చదువు, నీ జాబులనుంచి నే పొందే ఆనందం అపరిమితం. అయితే భానూ; నే నెలాటి శూన్య జీవితం గడుపుతున్నానో......

ఉత్తరం పూర్తి అయింది. నా కళ్లు చెమ్మగిల్లాయి. ఇంక యుద్ధం సాగింది నా గదిలో. వాగ్యుద్ధమే లెండి.

భరత్ మొదటి బాణం వేశాడు!" ఏమిటిరా ఈ తలాతోకలేనిమాటలు ; ఉన్నత విద్యచదివిన ఫలితం ఇలాఉంది. హృదయమంట! వేదనట! యాతనట! సానుభూతట! కన్నీళ్లట! లలితకళలుట! ఏమిటి ఈ అర్థంపర్థంలేని ఉన్నతప్రతాపాలు. ఒకసారి అగ్నిసాక్షిగా పెళ్లాడినతర్వాత, కిక్కురుమనకుండా, ముక్కునపేసులా, సంసారంగడపాలి. అంతేగాని ఈగాలిలో రెక్కలులేకుండా ఎగిరిపోవడమేమిటి? భర్తదైవం. అతడే సర్వస్వం. అరే భానూ! ఇటువంటి ఉత్తరాలు అందుకొని సగం నువ్వు ఆవిణ్ణి చెడగొట్టుతున్నావు? నా మాటవిని, "అమ్మాయీ! జరిగింది మరచిపో. త్రికరణ శుద్ధిగా భర్తకి, భర్త వైపువాళ్లకు సేవచేస్తూ ఉండు. ఆ సైగల్ పాటలు పాడడంమాని, త్యాగరాజ కృతులు నేర్చుకో. నీకు ఇహం, పరం, రెండు లభిస్తవి." అని ఒకముక్క రాసి పారేయి. దానితో చేతులుకడుక్కో!

భానుకి పాపం ఆ భాణం ఘాటుగాతగిలింది. దిమ్మదిరిగింది. మొగం తెల్లమతాబాకాల్చింది. నా వైపుదైన్యంగా చూచాడు, కనీసం నేను భరతతో ఏకీభవించను అనేధీమాతో.

భరత్ పలుకులు ములుకులై నన్నుగూడగాయపరిచాయి. నేనూ రంగంలోకి దూకానూ

"అరేయి భరత్! నువ్వు దురుసుగా" మాట్లాడుతున్నావు. ఆవిడ బాధ నీకెల్లా అర్థం అవుతుందిలే, పంటి నొప్పితో బాధపడనివానికి ఆ బాధ ఎల్లా తెలుస్తుంది? నువ్వు, ఆడజన్మఎత్తి, ఆ పరిస్థితుల్లోపడితే, తెలిసివచ్చేది?"

నాకు ఆవేశం హెచ్చింది. బిగ్గరగా, ఆమెయే నా స్నేహితురాలైతే, నా చెల్లెలే అయితే, లేక నా కూతురయితే, నేను ఆమెకిచ్చే సలహా ఏమిటో తెలుసా? "అమ్మాయి, ఇల్లా కుళ్ళి కుమిలిపోతే ప్రయోజన మున్న - భర్తతో నిర్మొగమాటంగా చెప్పేసెయి. "అబ్బాయి! మన స్వభావాలు వేరు. మనం కట్టే విలువలు వేరు. మన తత్వాలు వేరు. నీతో నేనిక కాపురంచెయ్యలేను. త్రోవన నన్నుపోనియ్యి. నీకు వండి, చాకిరిచేసి కేవలం నీ కామాన్నితీర్చే మొద్దులాంటి ఓ అమ్మాయిని పెళ్లిచేసుకో బాబూ, నమస్కారాలు. రాంరాం" అని చెప్పేసి విడాకులు ఇచ్చివేసి పైచదువు చదివి ... "

"మజాచేస్తూఉండు" అని వెటకారంగా భరత్ నా వాక్యం పూర్తిచేసి సకిలించాడు.

నాకు ఒళ్లు మండింది, చెప్పొద్దూ? వాడిమీద విరుచుకుపడ్డాను, "ఏమిటిరా నీ వాగుడు? కొసదాకా నే చెప్పేది వినకుండానే అనవసర ప్రసంగం వేస్తావు? స్వావలంబినివై మహిళల అభివృద్ధికై ఏదుర్గాబాయమ్మగారిలాగునో పాటుబడి జన్మసార్థకంచేసుకో అని సలహాయిచ్చేవాణ్ణి" అని ముగించాను.

"మీ ఇద్దరితోనూ నేను ఏకీభవించను" అన్నాడు భాను తాపీగా.

నాదేమో విప్లవ పంథాట - భరత్‌ది అభ్యుదయ వ్యతిరేకపంథాట. ఆమె అల్లానే భర్తవద్ద ఉండాలనీ, అదే తపస్సు అనీ, కాని తన ఆవేదన వెళ్లబోసే ప్రాథమిక హక్కు ఆమెకు కలదనీ తేల్చాడు.

తుపాను చెలరేగి శాంతించింది. రమాదేవి అనే ఇంకో ఆవిడకూడ భానుకు ఉత్తరాలు రాస్తూ ఉంటుందని నాకు తెలుసు.

"భానూ! ఒక రకం జీవితం తెలుసుకున్నాం. మొన్న ఆ రమాదేవివద్దనుంచి జాబు వచ్చింది అన్నావే. అది చదువు విందాం" అని నేనన్నాను. భాను తన జేబులోనుంచి ఇంకో ఉత్తరంతీసి చదువనారంభించాడు.

నేను ఈ ఉత్తరాల్ని జోడించి ఒక కథానిక రాద్దాం అని ఆలోచనలోపడ్డాను.

"సోదరా!

నీ జాబుచేరింది. నేను కులాసా. మాపార్టీ పని ఏమిటో అర్థంకావడంలేదు అనిరాశావు. కాస్త మాపత్రికలు చదువుతూవుండు, తెలుస్తుంది. ఆర్. యస్. యస్. వాళ్ళని నాకుతెలుగా. అందాకా

ఎందుకు నీవు ఉన్నచోటకూడ మాపార్టీవాళ్లు ఉన్నారు. మేంసర్వవ్యాపులం. వాళ్ళవెంట ఒక రోజు వెళ్ళి కళ్లు తెరుచుకునిచూడు. నీకు బోధపడుతుంది. కష్టాలు ఎక్కడ ఉన్న అక్కడ మేము హాజరు. కూలీవాళ్లు, రైతులు మొదలగు కష్టజీవుల వాడలలో మేంపనిచేస్తూ ఉంటాం. వాళ్ళకి సంఘాలు పెట్టతాం. యజమానులు చేస్తున్న దాడులకు వ్యతిరేకంగా వాళ్లతోబాటు నిలబడి పోరాడుతున్నాం. రైతుసంఘాలు, వ్యవసాయకూలీ సంఘాలు, చేనేతపని వారి సంఘాలు, టీచర్ల సంఘాలు, N. G. O. ల సంఘాలు - ఇలాంటివి సంఘటితపరుస్తాం. ప్రజాసామాన్యనికి మేలుకూర్చే విధంగా పనిచేస్తున్నాం. మత సామరస్యానికి కృషి చేస్తున్నాం. ఇదంతా పనికివచ్చేపని గాదా ?

ప్రస్తుతం ఇక్కడ సంయుక్తస్త్రీ సంఘాల యాజమాన్యానMilk week(పాల సప్తాహం) జరుపుతున్నాం. పేటపేటలో స్త్రీల సమావేశాలు జరుపుతున్నాం. ప్రతిబీదబిడ్డకు, రోగులకు, గర్భిణీస్త్రీలకు మన సర్కారే పాలుసప్లయిచేయాలని మాడిమాండు. దీనికి డబ్బెక్కడిది అనేగా నీ సందేహం? భానూ, మానవాలు దగ్గర ఎంతబంగారం మూలుగుతో ఉందో, దాని విలువ ఎవరూ కట్టలేరు. మా రాష్ట్రంలో పిల్లలమాట అటుంచి, ప్రపంచంలో ఉన్న పేద పిల్లలందరికీ పాలు సప్లయిచేయవచ్చు. ఏండ్ల తరబడి ఆబంగారం సద్వినియోగం అవుతే మా ఉద్యమానికి అన్ని పార్టీల పత్రికలు చేయూత ఇస్తున్నది.

ఈ మధ్యనే బాలబాలికల సంఘాలకోసం ఒక నాటిక వ్రాశాను. బాలబాలికలే అనాటికి ఆడారు. చాలా బాగుందని మెప్పులు పొందాను.

నా సొంత గొడవ నీకు చెప్పలేదని నిష్ఠూరంగా వ్రాశావు. సరే, విను. మాతండ్రి ఒకడాక్టరు. ప్రాక్టీసు బాగానే ఉండేది. మాఅమ్మకు ఆయనకు పడేదిగాదు. ఒకసారి వినువుజనించి ఇల్లు వదలి వెళ్ళిపోయాడు. మళ్లీ పత్తాలేదు, అప్పడో నాది చిన్నతనం. చదువులో ప్రవేశించాను. ఇంటరు చదువుతూ ఒక పురుష పుంగవునితో పరిచయంగలిగింది. ఆ పరిచయం ప్రణయంగా పరిణమించింది. తర్వాత మామూలు విషాదం - ఇంకో ఆమెను పెళ్ళిచేసుకున్నాడు నన్ను మోసంచేసి. నాకు దెబ్బ బాగా తగిలింది. జీవితంమీద విరక్తి జనించింది. ట్రైనింగు ప్యాసయి టీచరుగా కాలంగడిపేదాన్ని. పార్టీచట్టం వ్యతిరేకంగా ఉన్న రోజులలో ఆ పార్టీతో సంపర్కం ఏర్పడింది. తరువాత పార్టీ సభ్యురాల్ని అయ్యాను. ఇంక ప్రజాసేవలో మునిగిపోయాను. మొదట ఈ నగరంలో ఒక్కర్తెను. ఇప్పుడు యిరవై మంది కార్యకర్త్రులం. జీవితం కృతకృత్యమైనట్లుంది. అనిర్వచనీయ ఆనందం అనుభవిస్తున్నాను. నిరాశ నిస్పృహలు తొలగిపోయాయి. హృదయ కుహరంలోనుంచి నూతన జీవిత ఉద్భవించినట్లుగా తోస్తూఉంది. ఇప్పుడు చీకు చింతలు మచ్చుకైనా దరికిరావు. పగలల్లా ఏదో ప్రజల పని చేస్తూ ఉంటాను. అలసిసొలసి ఇంటికి చేరుకుంటాను. పడకమీదవాలగానే కమ్మటినిద్ర పట్టుతూఉంది.”

భరత్ “భానూ! పోయినయేడు బి. ఏ. పరీక్షకు హైయిబేటుగా కూర్చుంది ; నువ్వు ప్రైవేటు చెప్పావు. ఆ మేరా యీమె!” అన్న జిజ్ఞాస చేశాడు.

“అవును. ఆమెయే” అన్నాడు భాను చదువుతూ

“ఎందుకోగాని భానూ! ఆ కాశీ హిందూ విశ్వవిద్యాలయం అంటే ఒక వ్యామోహం ఏర్పడింది. అక్కడి సుందర శిల్పభరిత భవనాలు, బారులుతీరిన దారులు, తోటలు, అక్కడి సూర్యోదయం, సూర్యాస్తమయం - ఆ ప్రాకృతిక సౌందర్యం - నేను ఒంటరిగా ఉన్నప్పుడు నన్ను చుట్టిముట్టేస్తూ ఉంటవి.

అది లఘురూపంలోఉన్న మన భరత్ వర్షం. ఎగిరి అక్కడ చావాలని అని ఉంది. కాని ఇప్పుడు తీరికలేదు. కాని మా సోషలిస్టు లక్ష్యం సిద్ధించిన తదుపరి - నేను బ్రతికే ఉంటే - నా చివర రోజులు ఆ గంగమ్మతల్లితీరాన గడుపాలని నా అభిలాష.

క్షమించు. ఒక తోడు దొరికింది - అయితే భాను! నన్ను నమ్ము - నేను పరమానందభరితుడయినాను.”

ఉత్తరం పూర్తి అయింది. అందరం ఆలోచనా సముద్రంలో పడిపోయాం. నేను సిగరెట్టు వెలిగించాను.